ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
శనివారం 9 నవంబరు 2024

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆస్పత్రుల్లో పండ్ల పంపిణీ



ఆది శ్రీనివాస్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు

8

రాజన్న ఆలయంలో కార్తీక సందడి

- తరలివస్తున్న భక్తులు
- ఆలయంలో కార్తీక దీపోత్సవం పూజలు



స్వామివారి దర్శనానికి బారులుదీరిన భక్తులు

7

న్యూస్ బాక్స్

కథల పోటీల్లో ప్రతిభ

ముస్తాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సారస్వత పరిషత్ నిర్వహించిన కథల పోటీల్లో మండలంలోని బందనకల్ గ్రామానికి చెందిన విద్యార్థిని మడకంటి లిఖిత ప్రతిభ కనబరిచింది. లిఖిత ప్రభుత్వ పాఠశాలలో 9వతరగతి చదువుతోంది. బాలల దినోత్సవం సందర్భంగా పోటీలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయుడు రాజ్‌కుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన హైరాబాద్‌లోని అబిడ్స్‌లో సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో బహుమతి ప్రదానం చేయనున్నట్లు చెప్పారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

వీర్నపల్లి, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం భూక్యతండాకు చెందిన రమావత్ మోహన్‌కు మంజూరైన రూ.11 వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్ శుక్రవారం అందజేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడు బాదావత్ రవి, మాజీ ఉపసర్పంచ్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని రేపాకలో సీఎం సహాయనిధి చెక్కులను మాజీ ఎంపీటీసీ కాథ సుమలతమల్లేశం శుక్రవారం పంపిణీ చేశారు.

రాజన్నకు వెండి నాగఫణి వితరణ

వేములవాడ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామికి దేవేందర్‌రెడ్డి అనే భక్తుడు వెండి నగపణిని శుక్రవారం అందజేశారు. ముందుగా దేవేందర్‌రెడ్డి కుటుంబ సభ్యలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ సూపరిండెంట్ తిరుపతిరావుకు వెండి నాగపణిని అందజేశారు.

- నేటి నుంచి ప్రారంభం
- ఇప్పటికే కుటుంబాల గుర్తింపు
- ఇంటింటికి స్టిక్కర్లు
- 1468 బ్లాక్‌లు, 1488 మంది ఎన్యూమరేటర్లు

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం



సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా




(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 1వ తేదీ నుంచి 3 వరకు ఇళ్ల జాబితాను సేకరించారు. 6 నుంచి 8వ తేదీ వరకు మరోసారి ఇళ్లను రివిజన్ చేసి కుటుంబాల లెక్కను పక్కాగా తేల్చారు. ఇంటిం టికీ స్టిక్కర్‌ను అంటించారు. గుర్తించిన ఇళ్లలోని కుటుంబాల సర్వేను శనివారం ప్రారంభించనున్నారు. ఇందులో భాగంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులం వంటి వివరాలు నమోదు చేయనున్నారు. జిల్లాలో 1,90,626 ఇళ్ల జాబితాను సిద్ధం చేశారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియను కలెక్టర్ పర్యవేక్షిస్తున్నారు. అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. మండ ల, మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారులను నియ మించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించడానికి అధికార యంత్రాంగం సిద్ధమైంది. ప్రణాళికా సంఘం ఆధ్వర్యంలో కుటుంబ వివరాల షెడ్యూల్ పత్రాలను సిబ్బందికి అందజేశారు.

జిల్లాలో 190626 కుటుంబాల గుర్తింపు 1,90,626 ఇళ్ల సర్వే లక్ష్యం

జిల్లాలో ముందస్తుగా ఇళ్ల జాబితాను సిద్ధం చేశారు. దీని ప్రకారం జిల్లాలో 1,93,873 ఇళ్ల అంచనాకు 1,90,626 ఇళ్లకు స్టిక్కర్లు వేశారు. వీటికి సంబంధించిన కుటుంబాల వివరాలను గుర్తించడానికి జిల్లాను 1468 బ్లాక్‌లుగా విభజించారు. 1488 మంది ఎన్యూమరేటర్లను నియమించారు. 160 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నారు. ప్రతీ ఎన్యూమరేటర్ 150 ఇళ్లను సర్వే చేయనున్నారు. ప్రభుత్వం అందించిన 75 ప్రశ్నల పత్రం నింపడానికి కనీసం అరగంటకు పైగానే సమయం పట్టనుంది. ప్రతీ రోజు కనీసం పది ఇళ్ల వరకు తగ్గకుండా సర్వే నిర్వహించనున్నారు. సర్వే సమాచారాన్ని ముందస్తుగానే ఆయా కుటుంబాలకు తెలియజేశారు.

మిగతా 8వ పేజీలో...



సర్వే మార్గదర్శకాల బుక్‌లెట్

జిల్లాలో 50 వేల కుటుంబాల పెరుగుదల

జిల్లాలో 2011 లెక్కల ప్రకారం చూస్తే జిల్లాలో 50 వేల కుటుంబాలు అదనంగా పెరిగాయి. ఇంటింటి సమగ్ర సర్వేలో భాగంగా ప్రతీ ఇంటికి వెళ్లి స్టిక్కర్ వేస్తూ లెక్కలు తీశారు. దీని ప్రకారం జిల్లాలో 50 వేల కుటుంబాలు అదనంగా పెరిగినట్లుగా గుర్తించారు. 2011లో 1,38,992 కుటుంబాలు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో 1,90,626 కుటుంబాలు పెరినట్లు లెక్కలు తేలాయి.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

రుద్రంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో అలంకరించారు. ఉదయం నుంచి సాయిబాబాను భక్తులు భారీ సంఖ్యంలో దర్శించుకున్నారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తీపిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, ఏంగల మల్లేశం, మంచే నారాయణ, మంచే ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కల్యాణం



స్వామివారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చిన్నబోనాలలో శుక్రవారం రుక్మిణీవేణుగోపాలస్వామి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా సాగింది. కార్తిక మాసంలో గ్రామంలోని శ్రీకృష్ణయాదవ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉత్సవ మూర్తులను గ్రామంలో ఊరేగించారు. అనంతరం అలయంలో రుక్మిణీవేణుగోపాల కృష్ణ స్వామి వారల కల్యాణాన్ని నిర్వహించారు. ప్రభుత్వవిప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు, శ్రీకృష్ణ యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

గంభీరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద రోడ్డు భద్రత, విలేజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. లింగన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది వేణుగోపాల్, స్థానిక ఎస్సై శివకుమార్ ప్రథమ చికిత్స, సీపీఆర్‌పై వివరించారు. మండల కేంద్రంతోపాటు గోరంటాల, రాజేశ్వర్‌రావునగర్‌లో అవగాహన సదస్సులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో రమేష్, ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఇల్లంతకుంట : సీపీఆర్, ప్రథమ చికిత్సపై పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మండలకేంద్రంలోని వైశ్యభవనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ అత్యవసర సమయంలో సీపీఆర్, ప్రథమ చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చన్నారు. ప్రతీ ఒక్కరు దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శరణ్య తదితరులు పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని స్కానింగ్ సెంటర్లను డిప్యూటీ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అంజలిఆల్ఫ్రెడ్ శుక్రవారం తనిఖీ చేశారు. స్కానింగ్ సెంటర్లలోని రికార్డులను పరిశీలించారు. ఆడ, మగ శిశువుల రిజిస్టార్లు, ఫామ్ ఆఫ్ ఆడిట్లో రేడియాలిజిస్ట్, డీజీవో వైద్యుల సంతాలకు ఉండాలని నిర్వా హకులను ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ బ్యానర్లను స్కానింగ్ సెంటర్లలోని రిసెప్షన్ హాల్‌లో ఉంచాలని, లింగనిర్ధారణ చేయకూడదని అన్నారు. అనంతరం ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేశారు. డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, సీహెచ్‌వో బాలచంద్రం పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయం

చందుర్తి, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. పోలీసులు-మీ కోసం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆశిరెడ్డిపల్లిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సాధించవచ్చ న్నారు. గంజాయి, మద్యం, జూదంవంటి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సంఘ విద్రోహశక్తుల ప్రలోభాలకు లొంగకూడదని, అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా పోలీస్ శాఖ ముందుంటుందన్నారు. ఏఎస్సై బాపు తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించాలి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూగజీవాలకు మెరుగైన వైదసేవలు అందించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం పశుసంవర్ధకశాఖ అధికారులతో పశువైద్యం, ఆసుత్రుల నిర్వహణపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో పశుసంవర్ధక శాఖ పని తీరు, చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, పశువులకు టీకా అందించడం వంటి అంశాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న పశు వైద్య ఆసుపత్రులలో సిబ్బంది అందుబాటులో ఉంటూ అవసరమైన వైద్య చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పశు వైద్యశాలలో విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని పశు వైద్యశాలలో మరుగుదొడ్లు లేవని అధికారులు తెలుపగా కలెక్టర్ వెంటనే స్పందిస్తూ ప్రతిపాదనలు పంపించాలని పేర్కొన్నారు. జిల్లాలో అక్టోబరు 25 నుంచి జరుగుతున్న 21వ అఖిల భారత పశు గణన కార్యక్రమం సందర్భంగా వీధి కుక్కలు, ఇతర పశువుల వివరాలను సేకరించాలన్నారు. వేములవాడ రాజన్న ఆలయం పరిధిలో ఉండే మూగజీవాలకు అవసరమైన వైద్య చికిత్స అందించేలా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని అధికారులకు సూచించారు. వ్యాక్సినేషన్ ప్రక్రియ వంద శాతం పూర్తి చేయాలన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, పశు వైద్యాధికారులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో సీఎం జన్మదిన వేడుకలు

వేములవాడ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను వేములవాడలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయంలో 55 కోడెలతో మొక్కు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాజన్న ఆలయం నుంచి 55 కోడెలను కట్టివేసి సీఎంకు శుభాకాంక్షలు చెప్పామన్నారు. ఎన్నికలకు ముందు పాదయాత్రలో భాగంగా సంకెపల్లి, రుద్రవరం ముంపు గ్రామాల్లో నిద్రచేసి మరుసటి రోజు వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయానికి వచ్చి అభిషేకం చేశారని, స్వామివారి ఆశీస్సులతోనే సీఎం కాగలిగి ప్రజలకు అండగా నిలిచారని అన్నారు. వేములవాడ రాజన్న క్షేత్రాన్ని పట్టణాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు. కాగా వేములవాడ పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాజన్న ఆలయం ముందు, అర్బన్ మండలంలోని నందికమాన్ చౌరస్తాలో ఆ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీఎం జన్మదిన వేడుకలకు ప్రభుత్వ విప్ కేక్‌కట్ చేశారు.



కోడెమొక్కు చెల్లిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వ ప్రాధాన్యం

ఇల్లంతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మండలంలోని అనంతగిరి అన్నపూర్ణ రిజర్వాయర్‌లో శుక్రవారం చేపపిల్లలను వదిలిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కుటుంబాలకు అండగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తోందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులను ఆదుకుంటామని హామీ ఇచ్చి నాసిరకం చేపపిల్లలను పంపిణీ చేసిందని, దీనిపై మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారని అన్నారు. అన్నివర్గాల ప్రజలను ఆదుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం సరైన ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ అధికారి సౌజన్య, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్యమహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, అధికార ప్రతినిధి పసుల వెంకటి, జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం, వైస్‌చైర్మన్ శేఖర్, నాయకులు ప్రసాద్, రజనీకాంత్, గోపాల్, అంతగిరి, కర్ణాకర్‌రెడ్డి, నరేష్, జమాల్ పాల్గొన్నారు.



అన్నపూర్ణ రిజర్వాయర్‌లో చేపపిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ప్రవేశాలు లేక కళాశాల వెలవెల

- ఎల్లారెడ్డిపేటకు గతేడాది డిగ్రీ కళాశాల మంజూరు
- ప్రవేశాలపై ఆసక్తి చూపని విద్యార్థులు
- రెండేళ్లుగా ప్రవేశాలు సున్నా

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం 2023-2024 విద్యా సంవత్సరంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ప్రభుత్వ అనుమతి లభించినా విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపకపోవడంతో కళాశాలలో ప్రవేశాలు ఒక్కటీ నమోదు కాలేదు. ఎన్నో ఏళ్ల కల సాకారమైన ప్రజాప్రతినిధులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు, రాజకీయ పార్టీల నాయకులు ప్రవేశాలు పెంచడంలో శ్రద్ధ వహించకపోవడంతో కళాశాల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రెండేళ్లుగా ప్రవేశాలు లేక ఏం చేయాలనే ఆలోచనలో పడ్డారు డిగ్రీ కళాశాల అధికారులు. ఇదే విధంగా ప్రవేశాలు నమోదు కాకపోతే డిగ్రీ కళాశాలను రద్దు చేస్తారని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే కొనసాగేలా..

గత ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేసి గ్రామీణ ప్రాంత విద్యార్థుల కలను నెరవేర్చిన ఆశించిన స్థాయిలో ఫలితం లేకుండాపోతోంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ(ఎంపీసీ), బీఎస్సీ(బీజడ్‌సీ), బీకాం, బీఏ కోర్సులకు అనుమతినిచ్చింది. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనే షిఫ్ట్ పద్ధతిలో కళాశాలను కొనసాగించేలా చర్యలు చేపట్టింది. సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌కు అదనపు బాధ్యతలు అప్పగించి తరగతుల నిర్వహించేలా ఆదేశాలు జారీ చేసింది. గతేడాదితోపాటు ఈ విద్యా సంవత్సరంలో బదిలీపై వెళ్లిన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. ఏటా ఆయా మండలాల్లో సుమారు వేయి మంది విద్యార్థులు ఇంటర్ విద్యను పూర్తి చేస్తున్నారు. దోస్త్‌లో ఏ ఒక్క విద్యార్థి ప్రవేశం కోసం నమోదు చేసుకోలేదు. ఇటీవల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టిన శంకర్ మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు చేరేలా చర్యలు చేపట్టిన ప్రయోజనం లేకుండాపోయింది.


PROCEEDINGS OF THE COMMISSIONER OF COLLEGIATE EDUCATION
GOVERNMENT OF TELANGANA, HYDERABAD

Sub: Collegiate Education - Sanction of New Government Degree College at Yellareddypet(M), Rajanna Sircilla District from the Academic Year 2023-24 ...

B.A. CBCS (E/M)	60 seats
B.Com (Comp. App.) CBCS (E/M)	60 seats

కళాశాలను మంజూరు చేస్తూ విద్యా కమిషనర్ జారీ చేసిన ఉత్తర్వులు

అనుమతిచ్చినా.. సౌకర్యాలు కరువు

కళాశాలలో సౌకర్యాలు కల్పించకపోవడంతో తరగతులు జరుగుతాయో లేదోననే విద్యార్థుల్లో సంశయం నెలకొంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలోనే కొనసాగించాలని పేర్కొన్నా అధ్యాపకుల నియామకంపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడం ప్రధాన కారణంగా విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు భావిస్తున్నారు. మొదట ఆరుగురు విద్యార్థులు ప్రవేశం పొందిన తరగతులు కొనసాగకపోవడంతో వారూ ఇతర కళాశాలలో చేరారు. ఇప్పటికైనా ప్రభుత్వం, సంబంధిత శాఖ అధికారులు, విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులు దృష్టి సారించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని, కళాశాలను కాపాడుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వసతులు కల్పించాలి

- రంజిత్‌కుమార్, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్



మండల కేంద్రంలో గత ప్రభుత్వం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేసినా వసతులు కల్పించలేదు. పూర్తి స్థాయిలో కళాశాల భవనం, తరగతి గదులు, అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయాలి.

కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం

- డాక్టర్ శంకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్



మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలు నమోదు కాకపోవడంపై కళాశాలల విద్యా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. సమస్యలను వివరించాం. కళాశాలలో ప్రవేశాలు పెంచేలా అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలి.



రాజన్న ఆలయంలో కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



ధర్మపురి గోదావరిలో దీపాలు వదులుతున్న మహిళలు

కార్తీక దీపోత్సవం

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సందడి

కార్తీక శుక్రవారం సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో సందడి నెలకొంది. మహిళలు భక్తితో దీపాలు వెలిగించి తమ ఇష్టదైవాలను స్మరించుకున్నారు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టులో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వేములవాడ కల్చరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజ రాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక దీపోత్సవం వైభవంగా కొన సాగు తోంది. కార్తీకమాసం సందర్భంగా నిత్యం రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో సామూహికంగా కార్తీక దీపాలు వెలిగిస్తున్నారు. శుక్రవారం కార్యక్రమాన్ని ఏఈవో రమేష్‌బాబు ప్రారంభించారు. ఆలయానికి వచ్చిన భక్తులతోపాటు పట్టణానికి చెందిన మహిళలు వివిధ ఆకృ తుల్లో దీపాలను వెలిగించారు. అంతకుముందు స్వామివారికి మొక్కు లు చెల్లించుకున్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి చెందిన భక్త బృందం భజన కార్యక్రమం ఆకట్టుకుంది. వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. ఈ సందర్భంగా భక్తులు రాజన్న ఆలయ ఎదుట కార్తీక దీపాలను వెలిగించారు.



కొండగట్టులో దీపారాధన

● **ధర్మపురిలో కొనసాగుతున్న గోదావరి హారతి**

ధర్మపురి: ధర్మపురిలో గోదావరి హారతి కొన సాగుతోంది. ఏడో రోజు శుక్రవారం ఆలయం నుంచి వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య విశేష పూజలు జరిపారు. నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.



ధర్మపురిలో గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

● **కొండగట్టులో..**

మల్యాల: కార్తీకమాసాన్ని పురస్కరించుకుని కొండగట్టు అంజనేయ స్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న దీపోత్సవం కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం రాత్రి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంత రం భక్తులతో కలిసి దీపారాధన చేశారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు చంద్రశేఖర్, ప్రధానర్చకులు రఘు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

జమ్మికుంట రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండ లం నాగంపేట గ్రామ సమీపంలో ట్రాలీ ఆటో, బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాల య్యాయి. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ముత్తారం గ్రామానికి చెందిన చుంచు రమేష్, తుడవేన చంద్ర మొగిలి బైక్‌పై జమ్మికుంటకు వచ్చారు. పని ముగించుకుని తిరిగి స్వగ్రామానికి బయల్దేరగా, మార్గం మధ్యలో నాగంపేట సమీపంలో ట్రాలీ ఆటో ప్రమాదవశాత్తు ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న రమేష్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక ఉన్న చంద్ర మొగిలి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రమేష్ భార్య శిరీష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణసీఐ వరంగంటి రవికుమార్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుకున్న వ్యక్తికి వినూత్న శిక్ష

● రెండు రోజులు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని జడ్జి తీర్పు

పెద్దపల్లిటౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టు బడిన వ్యక్తికి శుక్రవారం వినూత్న శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ట్రాఫిక్ సీఐ అనీల్‌కుమార్ తెలిపారు. వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ 22 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు. వారిని విచారించిన జడ్జి మంజుల 20మం దికి 23వేల రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన కమాన్‌పూర్‌కు చెందిన ఇందారపు రమేష్‌కు 500 రూపాయల జరి మానాతో పాటు సామాజిక సేవలో భాగంగా రెండు రోజులపాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పుని చ్చారు. శని, ఆదివారాల్లో రమేష్‌ను ట్రాఫిక్ విధుల్లో ఉపయోగించు కోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహ నాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

అడ్ హాక్ కమిటీ సభ్యుడిగా నర్సాగౌడ్

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ పార్లమెంట్ అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా మండల కేంద్రానికి చెందిన గుర్రం నర్సాగౌడ్‌ను నియామకం చేస్తూ టీడీపీ నాయకత్వం ఉత్తర్వులను జారీ చేసింది. టీడీపీ అధినేత చంద్రబాబునా యుడు 2024-2026 టీడీపీ సభ్యత్వ నమో దుకు అడ్‌హాక్ కమిటీ సభ్యుడిగా నియామ కం చేసినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. నర్సాగౌడ్ మాట్లాడుతూ చొప్పదండి నియో జక వర్గంలో అధికంగా పార్టీ సభ్యతం చేయిస్తానన్నారు. టీడీపీ నాయ కులు ఇచ్చిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.



నర్సాగౌడ్

బ్యాటరీ దొంగల అరెస్టు

గన్నేరువరం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గన్నేరువరం, మానకొం డూరు, తిమ్మాపూర్, కొత్తపల్లి, శంకరపట్నం మండలాల్లో పలు గ్రామాల్లో 5.2 లక్షల రూపాయల విలువ గల ట్రాక్టర్ బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించిన ముఠాను గన్నేరువరం పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌లో ఏసీపీ వెంకటరమణ విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడిం చారు. రామడుగు మండలంలోని వెదిరె గ్రామానికి చెందిన సత్తు ప్రవీణ్(19)తోపాటు మరో నలుగురు కరీంనగర్‌లో సెల్ఫ్ డ్రైవింగ్ కారును అద్దెకు తీసుకుని చుట్టుపక్కల గ్రామాల్లో తిరుగుతూ ఆరుబ యట నిలిపి ఉంచిన ట్రాక్టర్ల లోని బ్యాటరీలను, హైడ్రాలిక్ పట్టీలను దొంగలించడం ప్రారంభించారు. ఈ క్రమంలో గన్నేరువరం మండ లంలోని గునుకుల కొండాపూర్, గుండ్లపల్లి గ్రామాల్లో 16 ట్రాక్టర్ల బ్యాటరీలు, హైడ్రాలిక్ పట్టీలు దొంలించడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గన్నేరువరం ఎస్ఐ, సిబ్బందితో కలిసి సీసీ కెమ రాల ఫుటేజీతో నేరస్థులు వాడిన కారును గుర్తించారు. ఆ కారు ద్వారా నిందితులను పట్టుకున్నారు.. బ్యాటరీల దొంగతనంపై కమిషనరేట్ పరిధిలోని ఐదు పోలీస్‌స్టేషన్‌లలో గన్నేరువరంలో రెండు, ఎల్ఎండీలో మూడు, కొత్తపల్లిలో ఒకటి, మానకొండూరులో ఒకటి, శంకరపట్నంలో ఒకటి మొత్తం ఎనిమిది కేసులు నమోదయ్యాయి. 39 బ్యాటరీలు, 25 హైడ్రాలిక్ పట్టీలను దొంగల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.అతి తక్కువ సమయంలో దొంగలను పట్టుకున్నందుకు కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, సీఐ స్వామి గన్నేరువరం ఎస్ఐ తాండ్ర నరేష్, పోలీస్ సిబ్బందిని అభినందించారు.



వివరాలను వెల్లడిస్తున్న కరీంనగర్ రూరల్ ఏసీపి వెంకటరమణ

చికిత్స పొందుతూ చిన్నారి మృతి

చొప్పదండి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దీపావళి రోజున కాలిన టపాసులు మీద పడి గాయపడిన ఓ చిన్నారి చికిత్స పొందుతూ మృతి చెందింది. చొప్పదండికి చెందిన మహేష్, సరిత దంపతులు ఉద్యోగరీత్యా హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. దీపావళి రోజున మహేశ్ దంపతులు నివాసం ఉంటున్న అపార్ట్మెంట్ కింద పిల్లలు టపాసులు కాల్చుకున్నారు. చల్ల మహేశ్వరి(8) కూడా టపాసులు కాల్చుతుండగా ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. తీవ్రంగా గాయపడ్డ మహేశ్వరిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

అక్రమ వడ్డీ వ్యాపారులపై పోలీసుల కొరడా



సిరిసిల్ల పట్టణంలో దాడులు నిర్వహిస్తున్న పోలీసులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అనుమతులు లేకుండా వడ్డీ వ్యాపారం, ఫైనాన్స్ నిర్వహిస్తున్న వారిపై పోలీసులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా పోలీసులు 24 బృందాలుగా ఏర్పడి దాడులు చేశారు. ఆరుగురుని అదుపులోకి తీసు కున్నారు. వారి వద్ద రూ.80 లక్షల విలువైన 216 డాక్యుమెంట్లు స్వాధీ నం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లా డుతూ జిల్లాలో అనుమ తులు లేకుండా ఫైనాన్స్ నిర్వహించినా, అధిక వడ్డీలతో సామాన్యులను ఇబ్బందులకు గురిచేసినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థితి, తాత్కాలిక అవస రాల కోసం అధిక వడ్డీలకు అప్పు చేసి తర్వాత చెల్లించలేక ఆత్మహత్య చేసుకోవద్దన్నారు. ప్రభుత్వ అనుమతితో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలన్నారు. అక్రమ ఫైనాన్స్ నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. డయల్ 100కు సమా చారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

అన్నదాతలకు కోతుల బెడద



ధాన్యం తింటున్న కోతులు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో కోతుల బెడద తీవ్రమైంది. ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్న రైతులు ఇబ్బం దులు పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో శుక్రవారం రోడ్డుపై ఓ రైతు ఆరబోసిన ధాన్యం కుప్పలపై కోతులు చేరి తినేశాయి. ధాన్యం వద్ద కాపాల ఉన్న వా నరాలు తమ పైకి ఎదురు తిరుగుతున్నాయని రైతులు వాపోతున్నారు. గ్రామాల్లో కోతుల సమస్యను పరిష్కరిం చాలని కోరుతున్నారు.

సొంతూరిపై మమకారం

● చదువుకున్న పాఠశాల అభివృద్ధికి చేయూత ● నిధులు సమకూరుస్తున్న ప్రవాస భారతీయులు



విద్యార్థులతో ఎన్ఆర్ఐ ఇంద్రసేనారెడ్డి(ఫైల్)

తంగళ్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్వంత ఉరుపై మమకారం.. అఆలు నేర్పి పాఠ శాలపై తరగని మక్కువ.. దశా బ్దకాలంగా పాఠశాలకోసం లక్షల రుపాయాల వెచ్చించి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామి అవు తూ పలువురికి ఆదర్శంగా నిల సుస్తున్నారు ఆ ఎన్ఆర్ఐ సోద రులు. తంగళ్లపల్లి మండలం బస్వాపూర్ గ్రామానికి చెందిన యలాల చిన్నఎల్లారెడ్డి-బాలవ్వ దంపతుల కుమారులు సుభాశ్ రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, సత్యనారా యణరెడ్డి, భాస్కర్‌రెడ్డి ఉన్నారు. గ్రామంలోనే ప్రభుత్వ పాఠశాల లో విద్యను అభ్యసిస్తున్న క్ర మంలో పెద్ద కుమారుడు సుభా ష్‌రెడ్డి మృతి చెందాడు. ముగ్గురు కుమారుల్లో ఇంద్ర సేనారెడ్డి, సత్యనారయణ రెడ్డి ఉన్నత చదువులు చదివి అమె రికాలో స్థిరపడ్డారు. చిన్న కుమా రుడు భాస్కర్‌రెడ్డి గ్రామంలోనే ఉంటున్నాడు.

● **క్రీడా మైదానానికి సొంత స్థలం**

తాము చదువుకున్న ప్రభు త్వ పాఠశాల అభివృద్ధికి అమెరి కాలో స్థిరపడ్డ యాలాల ఇంద్ర సేనరెడ్డి, సత్యనాయణరెడ్డి న డుం బిగించారు. మృతి చెంది న తమ సోదరుడు సుభాశ్‌రెడ్డి జ్ఞాపకార్థం పాఠశాల పక్కనే ఉన్న 19 గుంటల స్థలాన్ని క్రీడ మైదానం కోసం అందించారు. మై దానం చుట్టు ప్రహరీ, డయాస్‌ను నిర్మించారు. ఉపాధ్యాయుల కొరత ఏర్పడితే విద్యా వలంటీర్లను ఏర్పాటు చేసి వేతనాన్ని అంది స్తున్నారు. అటెండర్‌ను నియమించి వేత నం అందించారు. పాఠశాల కు రంగులు వేయించారు. ప్రతి సంవత్సరం విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందిస్తున్నారు. సోద రులు ఇద్దరు అమెరికాలో ఉన్నత స్థానంలో ఉన్నా సొంతూరిని మరవకుండా తోడ్పాటునందిస్తున్నారు.

● **పాఠశాలకు చేయూత నిస్తున్నారు..**



యాలాల సోదరులు పాఠశాలకు చేయూత నివ్వడంలో ముందుంటారు. గతంలో ఉపాధ్యాయుల కొరత ఉన్నప్పుడు తాత్కాలికంగా విద్యా వాలీంట ర్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు క్రీడా సామాగ్రి అందిస్తున్నారు. పాఠశాల కోసం లక్షల విలువ చేసే స్థలాన్ని విరాళంగా అందించారు.

- లత, ప్రధానోపాధ్యాయురాలు



వితరణగా అందించిన క్రీడా స్థలం, ఏర్పాటు చేసిన డయాస్

క్రైం కార్నర్

దుర్శేడ్‌లో గుడిసె దగ్ధం



పూర్తిగా దగ్ధం అయిన పూరి గుడిసె

కరీంనగర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండ లం దుర్శేడ్ గ్రామంలో ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధం అయ్యింది. గ్రామంలో బుడగ జంగాల కాలనీలో తూర్పాటి కనకమ్మ గుడిసె వేసు కుని కొన్నేళ్లుగా నివాసం ఉంటుంది. శుక్రవారం ఉదయం దేవుళ్ల చిత్ర పటాల వద్ద దీపాలు వెలిగించి బయటకు వెళ్లింది. ప్రమాదవ శాత్తు పూరిగుడిసెకు నిప్పంటుకుని పూర్తిగ దగ్ధం అయ్యింది. ఈ సంఘటన లో కనుకమ్మకు చెందిన తులం బంగారంతో పాటు నగదు, అలాగే 20వేల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని ఆమె తెలిపింది. అధికారులు స్పందించి కనుకమ్మ కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

కరీంనగర్ క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వృద్ధుడు (70)మృతి చెందినట్టు పోలీస్ అవుట్ పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ ప్రభా కర్, రవి తెలిపారు. మృతుడి ఎడమ కాలుకు గాయాని సంబందించిన బ్యాండెజ్ కట్టి ఉందని తెలిపారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభు త్వాసుపత్రిలోని మార్చురీ గదిలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుడిని గుర్తించిన వారు టూటౌన్ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

సిరిసిల్ల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గుడుంబా స్థావరాలపై ఆకస్మిక దాడులు నిర్వహించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. శుక్రవారం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. జిల్లాలో పోలీసు అధికారులు, సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఏకకా లంలో దాడులు చేసినట్లు చెప్పారు. 43 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని, 18 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 12 మందిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కానిస్టేబుల్‌పై దాడి కేసులో ఒకరికి ఆరు నెలల జైలు శిక్ష

రుద్రంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో 2017లో దసరా పండుగ సందర్భంగా విధి నిర్వహణలో ఉన్న కాని స్టేబుల్‌పై దాడి చేసిన వ్యక్తికి ఆరునెలల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి తీర్పు వెల్లడించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. 2017లో రుద్రంగి హైస్కూల్ గ్రౌండ్‌లో దసరా ఉత్సవాల సందర్భంగా పోలీస్ కానిస్టేబుల్ ఎండీ ఇంతియాజ్ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో రుద్రంగికి చెందిన శ్రావణ్ అనే వ్యక్తి కానిస్టేబుల్ విధులకు ఆటంకం కల్గిస్తూ దాడి చేశాడు. కానిస్టేబుల్ ఫిర్యాదుతో అప్పటి ఎస్సై రమేష్ కేసు నమోదు చేసి చార్జిషీట్ దాఖలు చేశారు. శ్రావణ్‌కు శుక్ర వారం వేములవాడ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ జ్యోతిర్మయి 6 నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ముత్తారం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ముత్తారం మండలం ఓడెడు గ్రామ పంచాయతీలోని వెంకటేశ్వరపల్లి గ్రామానికి చెందిన చుంచు రమేష్ అనే యువకుడు మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రమేష్ తన ద్విచక్రవాహనంపై కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం గుంపుల మానేరు వంతెన దాటుతుండగా వావిలాల ఎక్స్‌రోడ్ వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను ఢీకొట్టడంతో రమేష్ అక్కడికక్కడే మృతిచెందాడు.

కుక్కదాడిలో వృద్ధురాలికి గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేటలో శుక్రవారం ఓ కుక్క దాడిలో వృద్ధురాలు శనిగరపు నర్సవ్వ తీవ్రంగా గాయపడింది. నర్స వ్వ శుక్రవారం ఇంటి ఎదుట కూ ర్చుంది. రోడ్డు పైనుంచి వచ్చిన కుక్క ఒక్కసారిగా ఆమెపై దాడి చేసింది. కుటుంబసభ్యులు మండల కేంద్రం లోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సిరిసిల్ల ప్రభు త్వాసుపత్రికి తీసుకెళ్లా లని వైద్యులు సూచించారు. దాంతో ఆమెను సిరిసిల్లకు తరలించారు.



గాయాలను చూపుతున్న వృద్ధురాలు

గోదావరిలో యువకుడి గల్లంతు



గల్లంతైన యువకుడికి కోసం గాలిస్తున్న గజ ఈతగాళ్లు

మల్లాపూర్, నవంబరు, 8 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వేంపల్లివెంకట్రావుపేట గ్రామ శివారులోని గోదావరిలో ఓ యువకుడు శుక్రవారం గల్లంతయ్యాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాయికల్ మండలంలోని అయో ధ్య గ్రామానికి చెందిన పాకాల శ్రీవర్ధన్(18) అనే యువకుడు వేంపల్లివెంకట్రావుపేట గ్రామంలో ఓ శుభకార్యానికి కుటుంబ సభ్యుల తో కలిసి వెళ్లాడు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని గోదావరికి వెళ్లి స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతయ్యాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే గమనించి పోలీసులకు స మాచారం అందించారు. వెంటనే గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టినా శ్రీవర్ధన్ ఆచూకీ తెలియలేదు.

జ్వరంతో బాలిక మృతి

రాయికల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జగిత్యాల జిల్లా రాయికల్ మండ లం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన ఉషకుల నిత్యశ్రీ(9)అనే బాలిక జ్వరంతో శుక్రవారం మృతి చెందింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నిత్యశ్రీ రాయికల్ మండలం ఉప్పుమడుగు కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో 9వతరగతి చదువు తోంది. దీపావళి సెలవులకు ఇంటికి వచ్చిన నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదం డ్రులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి వైద్యుల సూచనల మేరకు మూడు రోజుల క్రితం కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం ఉదయం మృతి చెందింది.



నిత్యశ్రీ(ఫైల్)

రైతలకు నాణ్యమైన సేవలు అందించాలి

● టీజీఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ మేక రమేశ్‌బాబు

గణేశ్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని నార్తర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణా లిమిటెడ్ (టీజీఎన్ పీడీసీఎల్) కరీంనగర్ సర్కిల్ సూప రింటెండింగ్ ఇంజనీర్ మేక రమేశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. సులభతరంగా అర్థమయ్యే రీతిలో ఉండేందుకు ఎస్టిమేట్‌కు సంబంధించిన మెటీరియల్ తాలూకు వివరాలు, స్కెచ్ (నక్ష)ను తెలుగులో అందిస్తామని తెలిపారు. రైతులకు వ్యవసాయ ఎస్టిమేట్ కాపీలు తెలుగులో ఉండాలని తమ దృష్టికి తీసుకురావడంతో అందుకు అనుగుణంగా ఇంగ్లీష్‌లో కాకుండా ఇకనుంచి తెలుగులో అందచేస్తా మన్నారు. ఈ వివరాలు, రైతులకు వచ్చే ఎస్ఎంఎస్‌లో లింకు క్లిక్ చేయడం ద్వారా తెలుసుకోవచ్చున్నారు. అలాగే ఎస్ఎంఎస్ కూడా తెలుగులోనే పంపిస్తామని తెలిపారు. రైతులకు మరింత నాణ్యమైన సేవలు అందించే దిశగా ఎన్పీడీసీఎల్ కంపెనీ కార్యాచరణ చేపట్టిం దని అన్నారు. విద్యుత్ అధికారులు వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి అక్కడ ఉన్న విద్యుత్ సమస్యలను పొలంబాట కార్యక్రమం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. వంగిన స్తంబాలు, లూజ్‌లైన్లను సరిదిద్దుతున్నామని తెలిపారు. మోటార్లకు కెపాసిటర్లు పెట్టుకోవాలని రైతులకు అవగాహనా కల్పిస్తున్నామని, కెపాసిటర్లు అమర్చడం ద్వారా మోటార్లు మరింత కాలం మన్నికగా ఉండేందుకు దోహదపడు తాయన్నారు. లోవోల్టేజ్ సమస్య ఉండదన్నారు. ఆటోస్టార్టర్లు కూడా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించడానికి సంస్థ కట్టుబడి ఉందన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే జ్యోతి దేవి మృతి

అనారోగ్యంతో ఇటీవల ఆస్పత్రిలో చేరిక



మెట్‌పల్లి టౌన్/కోరుట్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి జ్యోతిదేవి అలియాస్ జ్యోతక్క శుక్రవారం గుండెపోటుతో మృతి చెందారు. మూడు రోజుల క్రితం జ్యోతిదేవి అస్వస్థతకు గురవ్వడంతో కుమారులు చికిత్స నిమిత్తం బెంగుళూర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. శుక్రవారం గుండెపోటు రావడంతో ఆస్పత్రిలోనే మృతి చెందారు. మెట్‌పల్లి నియోజకవర్గంలో కొమిరెడ్డి రాములు-జ్యోతి దేవి దంపతులు కాంగ్రెస్ పార్టీలో ఉండి రాజకీయంగా ఎదిగారు. జ్యోతిదేవి వెంకటరావుపేట ఎంపీటీసీగా గెలిచి మెట్‌పల్లి ఎంపీపీగా బాధ్యతలను నిర్వహించారు. అదే సమయంలో మెట్‌పల్లి ఎమ్మెల్యేగా ఉన్న చెన్నమనేని విద్యాసాగర్‌రావు కరీంనగర్ ఎంపీగా గెలుపొందడంతో మెట్‌పల్లి ఎమ్మెల్యే పదవికి విద్యాసాగర్‌రావు రాజీనామా చేశారు. దీంతో 1998లో మెట్‌పల్లి నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగాయి. ఆ ఎన్నికల్లో జ్యోతి దేవి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డిపై సుమారు 4వేల ఓట్ల మెజార్టీతో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం ఏఐసీసీ సభ్యురాలిగా కొనసాగారు. 33 శాతం మహిళా రిజర్వేషన్ కోసం అప్పుడు ఢిల్లీలో ధర్నా నిర్వహించి మహిళలను చైతన్యవంతులను చేశారు. 14 నెలలు ఎమ్మెల్యే పదవిలో ఉండి మెట్‌పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులను నిర్వహించి నియోజకవర్గ ప్రజలకు దగ్గరయ్యారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నియోజకవర్గ, మహిళల సమస్యల పరిష్కారానికి నిత్యం కృషి చేశారు. న్యాయ విద్య అభ్యసించిన కొమిరెడ్డి జ్యోతి దేవి కొంతకాలం మెట్‌పల్లి కోర్టులో ప్రాక్టీస్ చేశారు. మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు కూడా న్యాయవాది. ఆమె కొడుకులు కొమిరెడ్డి కరం, కొమిరెడ్డి విజయ్ ఆజాద్, కొమిరెడ్డి కపిల్ ముగ్గురిని కూడా న్యాయ విద్య చదివించారు. జ్యోతి మరణించడంతో నియోజకవర్గంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆమె భర్త మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములు ఏడాది క్రితం మృతి చెందారు. జ్యోతి దేవి అంత్యక్రియలు ఆదివారం మెట్‌పల్లి పట్టణంలో నిర్వహించనున్నట్లు సమాచారం.

నాట్యం..నటన



నాట్యంలో వివిధ ప్రదర్శనలు ఇస్తున్న వేముగంటి ఆశ్రిత

ఐదేళ్ల వయస్సు నుంచే శాస్త్రీయ నృత్యాన్ని అభ్యసించి పట్టు పెంచుకుంది. జాతీయ, అంతర్జాతీయ ప్రదర్శనలు ఇచ్చి పలువురి ప్రశంసలు అందుకుంది. అక్కడి నుంచి సినిమా రంగంవైపు అడుగులు వేసింది. ఆమె నటనకు మెచ్చిన దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి బాహుబలిలో కుంతల దేశపు రాణిగా అవకాశమిచ్చారు. ఈ పాత్ర ఆమె మంచి గుర్తింపు తెచ్చింది. చిత్రసీమలో తనదైన ముద్రను వేసింది హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన వేముగంటి ఆశ్రిత. నటన, నాట్యానికే పరిమితం కాకుండా సామాజిక రంగంపైనా దృష్టి సారించింది.



బాహుబలి-2 సినిమాలో అనుష్కతో వేముగంటి ఆశ్రిత

● సినిమా రంగంలో బోర్నపల్లి వాసి
● బాహుబలిలో పాత్రతో గుర్తింపు పొందిన ఆశ్రిత వేముగంటి
● కళా రంగం... సామాజిక రంగంలో తనదైన ముద్ర

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 8: సినిమా రంగంలో ప్రవేశించాలంటే ఒక సాహసం.. ఆ రంగంలో రాణించాలంటే కష్టంతో పాటు అదృష్టం కలిసి రావాలి.. ఈ వ్యాఖ్యాన్ని నిజం చేస్తూ.. ఎవరి సహాయం తీసుకోకుండా సినిమా రంగంలో అడుగులు పెట్టిన ఆ యువతి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకోగా.. తన ప్రతిభను సినిమా రంగానికే పరిమితం చేయకుండా తన చేతనంత సహాయం చేయాలన్న లక్ష్యంతో సామాజిక రంగంలో కూడా రాణిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుంది. హుజూరాబాద్ మండలం బోర్నపల్లిలో జన్మించి కళా, సామాజిక రంగాల్లో రాణిస్తున్న వేముగంటి ఆశ్రితపై ప్రత్యేక కథనం.

● కుటుంబ నేపథ్యం...

హుజూరాబాద్ మండలం బోర్నపల్లికి చెందిన వేముగంటి రమేష్-డాక్టర్ గీతకు కుమారుడు అక్షయ్, కూతురు ఆశ్రితలు ఉన్నారు. రమేష్ వృతిరీత్యా కార్పొరేట్ ట్రైనర్‌గా విధులు నిర్వహిస్తుంగా డాక్టర్ గీత హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మెడికల్ సైన్స్ డీన్‌గా పనిచేస్తున్నారు. సౌత్‌జోన్ హెడ్ జీఈ ఎలక్ట్రికల్ ప్రొడక్ట్ మేనేజర్ రఘుతో వేముగంటి ఆశ్రిత వివాహం జరిగింది.



వైఎస్సార్ బయోపిక్ చిత్రంలో విజయమ్మ పాత్రలో..

● సామాజిక రంగం వైపు అడుగులు

ఓ వైపు సినిమా రంగంలో రాణిస్తూనే మరోవైపు తనవంతు బాధ్యతగా సహాయం చేసేందుకు రోసి కాన్వెంట్ పాఠశాలలో అల్యూమిని సభ్యురాలిగా చేరి సామాజిక కార్యమాలను నిర్వహిస్తున్నారు. మహిళా సాదికారత, బాలికల విద్య ప్రాధాన్యంపై అవగాహన కల్పిస్తున్నారు. హైద్రాబాద్ నగరంలో నిర్వహించే పలు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

● భరత నాట్యం, కూచిపూడితో జాతీయ స్థాయిలో గుర్తింపు

ఐదేళ్ల వయస్సులో నుంచి వేముగంటి ఆశ్రిత శాస్త్రీయ నృత్యాన్ని నేర్చుకోవడం ప్రారంభించింది. కూతురిలో ఉన్న ప్రతిభను గుర్తించిన తల్లి ప్రముఖ నాట్య శిక్షకురాలు ప్రియా కార్తీకేయన్, రాజేశ్వరి సాయినాథ్ వద్ద సాంప్రదాయ కళ, భరతనాట్యంలో ఆధునాతన శిక్షణ ఇప్పించారు. దీంతో కళా రంగంపై మక్కువ పెంచుకున్నారు. హైద్రాబాద్, చెన్నై, బెంగు ళూర్ వంటి ప్రధాన నగరాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. మలేసియాలోని కౌలాలంపూర్‌లో మొదటి అంతర్జాతీయ ప్రదర్శన ఇచ్చారు. యూఎస్‌లో రెండు అంతర్జాతీయ ప్రదర్శనలు సైతం ఇచ్చారు. ప్రముఖనటుడు, దర్శకుడు కె విశ్వనాథ్ ఆమె ప్రదర్శనకు యాంకర్‌గా వ్యవహరించారు. ఈటీవీలో విశ్వనాథామృతం, వనిత టీవీలో కలయ శస్వీ షోలో ఆమె పాల్గొన్నారు.

● బాహుబలి-2, వైఎస్సార్ బయోపిక్‌లతో గుర్తింపు

ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన బాహుబలి-2 చిత్రంలో కుంతల దేశపు మహారాణి పాత్రకోసం దర్శకుడు రాజమౌళి వేముగంటి ఆశ్రితను ఎంపిక చేశారు. పాత్రకు సంపూర్ణ న్యాయం చేయడంతో ఆమె పలువురి ప్రశంసలు అందుకున్నారు. ఆమె నటనను చూసిన వైఎస్సార్ బయోపిక్ చిత్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సతీమణి పాత్రలో చాలా బాగా నటించారని ఆచిత్రాన్ని తిలకించిన షర్మిలా, విజయమ్మ ప్రశంసించారు. క్రాక్ మూవీలో విలన్ పాత్రలో నటించి పలువురి ప్రశంసలు అందుకున్నారు.



దర్శక ధీరుడు విశ్వనాథ్‌తో వేముగంటి ఆశ్రిత

న్యూస్ బాక్స్

పుచ్చకాయపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం



సీఎం ముఖ చిత్రాలతో కళాకారుడు అనిల్

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మండల కేంద్రానికి చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ పుచ్చకాయలపై సీఎం రేవంత్‌రెడ్డి చిత్రం తీర్చిదిద్ది అభిమానం చాటుకున్నాడు. శుక్రవారం 30 నిమిషాల వ్యవధిలో రెండు పుచ్చకాయలపై రేవంత్‌రెడ్డి చిత్రాన్ని వేశాడు. ఈ సందర్భంగా కళాకారుడు అనిల్‌ను కాంగ్రెస్ నాయకులు అభినందించారు.

సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల నేతన్నలకు ఉపాధి కల్పించాలని, ప్రస్తుతం అందిస్తున్న సబ్సిడీని మరింత పెంచాలని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీర మోహన్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని భావనారుషినగర్‌లో ఏర్పాటు చేసిన తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా కార్యాలయాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఖిల్లాగా పేరొందిందని గతంలో సరైన ఉపాధి లేక మరమగ్గాల కార్మికులు ఆత్మహత్యలు చేసుకునే వారని అన్నారు. ఆత్మహత్యల నివారణ కోసం గత ప్రభుత్వాలు, ఇక్కడి కార్మికులు, నేతన్నలకు ఉపాధిని కల్పించి ఆదుకున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 11 నెలలుగా నేతన్నలకు ఉపాధి కల్పించడం లేదని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉపాధి కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు శ్రీగాద మైసయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుంటుకు మహేష్, కౌన్సిలర్ పత్తిపాక పద్మ, బీజేపీ నాయకులు ఊర గొండ రాజు, గుడ్ల విష్ణు, చేనేత కళాకారుడు యెల్డి హరిప్రసాద్, గుజ్జెతార, మాజీ సర్పంచ్ సంధ్యారాణి, సిరిసిల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జీవో 29ను ప్రభుత్వం సవరించాలి



మాట్లాడుతున్న రాగుల రాములు

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముందుగా 29వ జీవోను సవరించిన తర్వాతే ఎస్సీ వర్గీకరణకు వెళ్లాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. జీవోతో బీసీలకు నష్టం వాటిల్లుతోందన్నారు. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పేద దళిత (మాలలు)ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెలువడగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేస్తామన్నారని గుర్తు చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఈ నెల 23న రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో మాలల ఆధ్వర్యంలో ర్యాలీ, భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎంపీపీ బొల్లు మాల శంకర్, మాజీ కౌన్సిలర్ సిరిగిరి రమేష్, నాయకులు పాల్గొన్నారు.

కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

● చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యం

కొడిమ్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూలో 2024-2025 సీజన్ ధాన్యం సేకరణపై అదనపు కలెక్టర్ లతతో కలిసి జిల్లా అధికారు లతో, మిల్లర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు తూకం వేయాలన్నారు. కోతలు విధిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలలోనే అమ్మాలన్నారు. దళారులను నమ్మి తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోవద్దన్నారు.

ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అంతకు ముందు అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు వచ్చిన ధాన్యాన్ని వెంటనే దించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తామన్నారు. కొనుగోలు కేంద్రాలలో అధికారులకు రైతులు సహకరించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో డీఎస్‌వో జితెందర్ రెడ్డి, డీఎం జితేంద్రప్రసాద్, కొడిమ్యాల, మల్యాల తహసీల్దార్లు రమేష్, మునీందర్, ఫుడ్ ఇన్స్‌పెక్టర్ నర్సింహస్వామి, కొడిమ్యాల, మల్యాల మండలాల రైస్ మిల్లర్లు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు జీవన్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

వృద్ధుల్లో మనోభావాలు నింపేందుకు అవగాహన సదస్సులు

సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యధర్శి హరి ఆశోక్ కుమార్

కోరుట్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వృద్ధుల్లో మనోభావాలు నింపేందుకు ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలో కోరుట్ల డివిజన్ సీనియర్ సిటీజన్స్ కార్యాయలంలో వృద్ధుల ఆత్మహత్య నివారణ - పిల్లల బాధ్యత అనే అంశంపై ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించి పలు అంశా లను వివరించారు. వృద్ధుల ఆత్మహత్య నివారణకు వారి పిల్లలు బాధ్యత వహించాలన్నారు. స్వంత ఇండ్ల నుంచి వెళ్లగొట్టడం, వృద్ధుల సంరక్షన గృహా లు, ఆనాధ శరణాలయాలలో నెట్టివేయడంతో తీవ్ర మానసిక వేదకు గురయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వాటి నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆత్మహత్యలు నివారించడానికి ఒక మానసిక నిపుణుడిని నియమించాలని అన్నారు. ఈ సదస్సులో సిటిజన్స్ సభ్యులు పబ్బా శివానం, గంటేడి రాజ్‌మోహన్, లక్ష్మీనారాయణ, ఎండి సైపోద్దిన్, వెల్మల ప్రకాష్ రావు, సాభితలీ, చిలుక గంగారాం, రాజయ్యలతో పాట పలువురు పాల్గొన్నారు.

ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తపడాలి



మోతె లో పొలంబాట నిర్వహిస్తున్న విద్యుత్ అధికారులు

ఏడీఈ జవహర్‌లాల్ నాయక్

జగిత్యాలరూరల్‌నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాలబారి నపడకుండా జాగ్రత్త పడాలని ఏడీఈ జవహర్ లాల్‌నాయక్ రైతులకు సూచించారు. జగిత్యాల మంలడంలోని మోతె గ్రామంలో శుక్రవారం విద్యుత్ అధికారులు పొలంబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల పొలాల వద్దకు వెళ్లి విద్యుత్ ప్రమాదాల నివారణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్‌నాయక్ మాట్లాడుతూ రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల ఫ్యూజులు ముట్టవద్దని, ప్రమాదాలు జరిగే ప్రమాదం ఉన్నందున ఎలాంటి సమస్యలు వచ్చిన విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కారిస్తారని తెలిపారు.

పొలాల చుట్టూ అక్రమంగా కంచెలు ఏర్పాటు చేయరాదని, పొలాల వద్ద రైతులు స్టార్టర్లు, ఫ్యూజ్‌లు నాణ్యతగా ఉండేవి ధంగా చూసుకోవాలని రైతులను కోరారు. ఈకార్యక్రమంలో ఏఈ శ్రీధర్, లైన్‌ఇన్ స్పెక్టర్ రాజయ్య లైన్‌మెన్ రవి, అసిస్టెంట్ లైన్ మెన్ శివశంకర్, మాజీ ఎంపీటీసీ రాజశేఖర్ రెడ్డి, రైతుసంఘంనాయకులు సదాశివరావు, రాజేశ్వర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

వెల్గటూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలం లోని చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, పీడీ మహేష్ తెలిపారు. ఈనెల 5న కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన జోనల్ లెవెల్ 14 సంవత్సరాల బాల బాలికల పోటీలలో సమీర, సాయి చరణ్, మల్లికార్జున్ లు అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 8 నుంచి 10 వరకు సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలలో విద్యార్థులు పాల్గొననున్నట్లు తెలిపారు. పాఠశాల నుంచి ముగ్గురు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సామల కవిత, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయ బృందం, గ్రామస్థులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు మండలంలోని వెల్లుల్ల గ్రామానికి చెందిన విద్యార్థి బబ్బిలి అక్షయ్ ఎంపికైనట్లు నిర్వహకుడు మరిపెల్లి ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడు నర్సాగౌడ్, కొమరయ్యలతో పాటు ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో అండర్-17 బాలుర వి భాగంలో బబ్బిలి అక్షయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి గెలిపొందాడు. పోటీల్లో ప్రతిభ కనబరించిన విద్యార్థి అక్షయ్‌ను నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

వైకుంఠధామంలో కనీస వసతులు కరువు

● నీరు లేక ఇబ్బందులు.. వాగులో స్నానాలు
● ఇబ్బంది పడుతున్న గ్రామస్థులు



వైకుంఠ దామంలో పని చేయని బోరు

కరీంనగర్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం దుర్శేడ్ గ్రామ వైకుంఠధామంలో కనీస వసతులు లేక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దహన సంస్కరాల తర్వాత స్నానం చేసేందుకు నీరు కూడా అందించలేని పరిస్థితి నెలకొంది. దీంతో గ్రామస్థులు పక్కనే ఉన్న వాగులో స్నానాలు చేస్తున్నారు. కరంట్ మోటార్ పనిచేయక రెండు నెలలు గడిచినా అధికారులు పట్టించుకోవడం లేదు. వైకుంఠ ధామంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. దీంతో పాములు, తేళ్లు సంచరిస్తున్నాయి. అధికారులు వైకుంఠ ధామంలో సౌకర్యాలు కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న వైకుంఠదామం

న్యూస్ బాక్స్

ఇసుకకు అనుమతులు ఇవ్వాలి

ఇల్లంతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజల అవసరాలకు ఇసుక అనుమతులు ఇవ్వాలని బీజేపీ నాయకుడు మ్యాకల మల్లేశం ప్రకటనలో కోరారు. ఇంటి నిర్మాణాలు చేపట్టే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అత్యవసరంగా ఇసుక కావలసిన వారిని కొంత మంది దోచుకుంటున్నారని ఆరోపించారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఇల్లంతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేటలో బీఆర్‌ఎస్ నాయకుడు సావనపెల్లి అనీల్‌కుమార్‌ను మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం పరామర్శించారు. అనీల్‌కుమార్ తండ్రి రాజెల్లయ్య రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎంద్ర చందన్, ఒరుపుల రాములు, బాలకిషన్, గొల్లపల్లి సత్యం, మందల లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరులో దివ్యాంగులకు క్రీడలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల వారోత్సవాలలో భాగంగా డిసెంబర్‌లో దివ్యాంగులకు క్రీడోత్సవాలు నిర్వహిస్తామని జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఆకుల సంధ్య అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షురాలు సంధ్య మాట్లాడారు. డిసెంబరులో దివ్యాంగుల క్రీడోత్సవాలకు ముఖ్య అతిథులుగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి, మున్సిపల్ కమిషనర్, అధికారులను ఆహ్వానిస్తున్నామన్నారు. జిల్లాలోని దివ్యాంగులు పెద్ద సంఖ్యలో క్రీడోత్సవాలలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. అనంతరం దివ్యాంగుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేసుకున్న పొదుపు సంఘం నుంచి మహమ్మద్ సుల్తానాకు రూ.10వేలు రుణంగా సంఘం సభ్యులు అందించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బోగ రాజయ్య, ఉపాధ్యక్షుడు జవాజీ అమర్నాథ్, సహాయ కార్యదర్శి అంబటి శ్రీనివాస్, కోశాధికారి ఉరవకొండ లత, గౌరవ అధ్యక్షులు బియ్యంకార్ శ్రీనివాస్, చీకోటి అనిల్‌కుమార్, సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

వేములవాడ, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలికను పెళ్లి చేసుకొని లైంగికంగా వేధించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు వేములవాడ పట్టణ సీఐ వీర ప్రసాద్ శుక్రవారం తెలిపారు. సిరిసిల్ల పట్టణం పెద్దూరుకు చెందిన వ్యక్తి బాలికను వివాహం చేసుకొని లైంగింకంగా వేధించాడు. బాలిక గర్భంరావడంతో అబార్షన్ కోసం సిరిసిల్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లాడు. మైనర్ అని తెలిసినా సంబంధిత అధికారులకు సమాచారమివ్వకుండా ఆస్పత్రివారు అబార్షన్ చేశారు. బాధితురాలి ఫిర్యాదుతో సదరు వ్యక్తిపై 21 పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు, ఆస్పత్రిపై 211 బీఎన్‌ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ తెలిపారు.

యాదవ సంఘం సొసైటీ

కోనరావుపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట యాదవ సంఘం సొసైటీ అధ్యక్షుడిగా ప్రశాంత్ యాదవ్‌తో పాటు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డిస్టిక్ కో ఆపరేటివ్ ఎన్నికల అధికారి రాములు ప్రకటనలో తెలిపారు. కార్యదర్శిగా కొమ్ము తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా కొమ్ము ఎల్లయ్య, అసరి లక్ష్మన్, జప రాములు, మంచాల భాగ్యలక్ష్మీ, ముచర్ల లచ్చవ్వ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

'కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్న అదనపు కలెక్టర్'

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న కాంట్రాక్టర్లకు అదనపు కలెక్టర్ వత్తాసు పలుకుతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏఐటీయూసీ అనుబంధ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపట్టినట్లు చెప్పారు. స్పందించిన ప్రభుత్వ అధికారులు ఏఐటీయూసీ అనుబంధ హమాలీ కార్మిక సంఘం నాయకులతో చర్చలకు పిలిచారని, చర్చల్లో అదనపు కలెక్టర్ మాట్లాడిన విధానం విడ్డూరంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. ఒక్క లారీలో 600 బస్తాల కంటే ఎక్కువగా ఓవర్‌లోడ్ వేయవద్దని సంఘం ప్రతినిధులు చెబితే లారీ ఓనర్లు ఎన్ని వందల బస్తాలు వేయాలంటే అన్ని వందల బస్తాలు వేయాలని చర్చలో అదనపు కలెక్టర్ చెప్పడం దురదృష్టకరం అన్నారు. లారీలలో అధిక బస్తాలు వేసే సమయంలో హమాలీలలకు ప్రమాదాలు జరిగితే దానికి అదనపు కలెక్టర్ బాధ్యత వహిస్తారా అంటూ ప్రశ్నించారు. తాడుమావుల గురించి ప్రస్తావిస్తే జాయింట్ కలెక్టర్ దాట వేశారన్నారు. గత ప్రభుత్వాలు నేరుగా హమాలీ కార్మికులకు ఒక్క టన్నుకు రూ.40 చొప్పున తాడుమావుల ఇచ్చారని ప్రస్తుత ప్రభుత్వం నుంచి కాంట్రాక్టర్లుకు వారి నుంచి హమాలీ కార్మికులకు ఇచ్చే విధానం అమలు చేయడంతో హమాలీలకు తాడుమావుల ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైన ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు హమాలీ సంఘం ప్రతినిధులతో చర్చలు జరిపి వారికి రావాల్సిన తాడుమావుల ఇప్పించాలన్నారు. హమాలీ సంఘం జిల్లా కన్వీనర్ పంతం రవి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని పలువురు వక్తలు అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం కుబేర స్వామి పదవీ విరమణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, ఎంపీడీవో సత్తయ్య, ఎంఈవో కృష్ణహరి, హెచ్‌ఎం మనోహరచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ, సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి, టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో నియంత పాలనను అంతమొందించి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చినవారిలో రేవంత్‌రెడ్డి ఘనత ఉందన్నారు. బడుగు బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు తీయిస్తున్నారన్నారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి మ్యాన ప్రసాద్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, మహిళా జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత, రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షురాలు ఆడెపు చంద్రకళ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దుబాల వెంకటేశం, కాసర్ల రాజు, కౌన్సిలర్ వేముల రవి, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మినారాయణ, దేవదాస్, లక్ష్మీనర్సయ్య పాల్గొన్నారు.

● వేములవాడ ఆగ్రహారంలో శ్రీభక్త ఆంజనేయ స్వామి దేవాలయంలో జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని విలీన గ్రామాలైన చంద్రంపేట, పెద్దూర్, సర్ధాపూర్, గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. సర్ధాపూర్‌లో కాంగ్రెస్ పట్టణ ప్రధాన కార్యదర్శి గంభీరావుపేట ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో స్థానిక హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రంపేటలో వార్డు అధ్యక్షుడు నూనె శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. 8వ వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ మంగ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. మానకొండూర్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ ఐరెడ్డి చైతన్య మహేందర్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశం రాజేందర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మాజీ ఎంపీపీ గుడిసె అయిలయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాత బస్టాండు ప్రాంతంలో టపాసులు పేల్చి కేక్ కట్ చేశారు. ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాజయ్య, సాహెబ్, రాజేశం, గౌస్, గిరిధర్‌రెడ్డి, విజయ్ రెడ్డి, బాల్‌రెడ్డి, లింగాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : తంగళ్లపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జల్లం ప్రవీణ్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు నేరెళ్ల నర్సింగం గౌడ్, మచ్చ శ్రీనివాస్, లింగాల భూపతి, భైరినేని రాము, మీరాల శ్రీనివాస్, జూపెల్లి రాజేశ్వరరావు ఉన్నారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు హమీద్, పట్టణ అధ్యక్షుడు పాపరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రారెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగి స్వామి, నాయకులు తదితరులు ఉన్నారు.

ముస్తాబాద్: ముస్తాబాద్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజీవ్ కూడలిలో కేక్ కట్ చేశారు. సింగిల్‌విండో చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, మెరుగు యాదగిరిగౌడ్, కిషన్ రావు, తలారి నర్సయ్య, కొండం రాజిరెడ్డి, ప్రతాపరెడ్డి, రంజాని నరేశ్ పాల్గొన్నారు.

వీర్నపల్లి : సీఎం రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను వీర్నపల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బిటి యాదవ్, ఏఎంసీ చైర్మన్ రాములు నాయక్, ఏఎంసి వైస్ చైర్మన్ లెంకెల లక్ష్మణ్ పాల్గొన్నారు.

వేములవాడ రూరల్: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు బొడ్డు రాములు, రంగు వెంకటేశం,రొండి రాజు, సోయినేని కరుణాకర్, వంగపల్లి మల్లేశం, బండ శ్రీనివాస్, బాలస్వామి శ్రీనివాస్, సయ్యద్ ఆదిల్ పాషా, ప్రభాకర్ పాల్గొన్నారు.

బోయినపల్లి : బోయినపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఏనుగుల కనకయ్య, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు కూస రవీందర్, మాజీ జడ్పీటీసీ పులి లక్ష్మీపతిగౌడ్, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, ఏఎంసీ చైర్మన్ బోయిన ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. జిల్లా నాయకులు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, కేతిరెడ్డి లక్ష్మారెడ్డి, చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, కచ్చకాయల ఎల్లయ్య, చేపూరి గంగాధర్, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, పల్లె రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, నాయకులు మల్లేశం, గొట్టె ప్రభాకర్, భీమారాజు కనకరాజు, బాలకృష్ణ, గణేష్, లింగంపల్లి అజయ్ పాల్గొన్నారు.

రుద్రంగి: రుద్రంగి మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, కేశిరెడ్డి నర్సారెడ్డి, గండి నారాయణ, గడ్డం స్వామి, తర్రె లింగం, పల్లి గంగాధర్, మాడిశెట్టి అభిలాష్, గంధం మనోజ్ పాల్గొన్నారు.

రుద్రంగి మండలం మానాలలో రేవంత్ రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు జలపతి, మోహన్, వంశీ పాల్గొన్నారు.



ఇల్లంతకుంటలో కేక్ కట్ చేస్తున్న నాయకులు



ఎల్లారెడ్డిపేటలో..

12న జగిత్యాలకు కేటీఆర్ రాక

జగిత్యాల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల 12వ తేదీన కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ నిర్వహించనున్న పాదయాత్రకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ జగిత్యాలకు రానున్నట్లు బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఎస్సారెస్పీ క్యాంపులో గల బీఆర్‌ఎస్ కార్యాలయం లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యాసాగర్ రావు మాట్లాడారు.

ఈనెల 12వ తేదీన ఉదయం 8.30 గంటలకు కోరుట్ల నుంచి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాదయాత్ర ప్రారంభమవుతుందని, మోహన్‌రావుపేట, వేములవాడ నియోజకవర్గంలోని మేడిపల్లి, జగిత్యాల నియోజకవర్గంలోని చల్‌గల్ మీదుగా జగిత్యాల కొత్త బస్టాండ్ వద్దకు పాదయాత్ర చేరుతుందన్నారు. చల్‌గల్ ప్రాంతంలో కేటీఆర్, హరీశ్‌రావు, కొప్పుల ఈశ్వర్ పాదయాత్రలో భాగస్వామ్యం అవుతారన్నారు. జగిత్యాలలోని కొత్త బస్టాండు వద్దకు సాయంత్రం 4 గంటల వరకు పాదయాత్ర ద్వారా చేరుకుంటారన్నారు. సుమారు ఎనిమిది వేల మంది రైతులతో సభను నిర్వహించిన అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తారని వివరించారు. ప్రభుత్వ వైఫల్యాలు, రైతులనుద్దేశించి ముఖ్యనేతలు ప్రసంగిస్తారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడానికి, పాదయాత్రకు అధిక సంఖ్యలో రైతులు, రైతు కూలీలు, అన్ని వర్గాల ప్రజలు తరలి రావాలని కోరారు. పదకొండు నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురయ్యారన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు గట్టు సతీష్, నాయకులు దావ సురేశ్, హరిచరణ్, సుంకె మహేశ్, ఆనంద్‌రావు, గంగారెడ్డి, గంగాధర్, ప్రసాద్, దారిశెట్టి రాజేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్వకుంట్ల విద్యాసాగర్ రావు

సమగ్ర ఇంటింటి సర్వేకు ఏర్పాట్లు పూర్తి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం శనివారం నుంచి చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సర్వే వివరాలు వెల్లడించారు. జిల్లాలో మొత్తం లక్షా 90 వేల 626 ఇళ్లు, 1468 బ్లాకులు ఉన్నాయని గుర్తించామని, ప్రతీ 150 ఇళ్లకు ఒక ఎన్యూమరేటర్ చొప్పున వివరాలు సేకరిస్తారని తెలిపారు. 160 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు చెప్పారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే షెడ్యూల్‌పై ప్రజలకు ముందుగా సమాచారం అందించాలన్నారు. సర్వే సమయంలో ప్రజలు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతీ రోజు నిర్వహించే సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఎన్యూమరేటర్ మండల స్థాయిలో తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాలన్నారు. ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. సర్వే వివరాలను ఎంపీడీవో ఆధ్వర్యంలో సేకరించి నివేదికలు అందజేయాలన్నారు. సర్వేలో మహిళను గృహ యజమానిగా నమోదు చేస్తారని, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల, రాజకీయాలకు సంబంధించిన వివిధ అంశాల్లో సమాచారం సేకరిస్తారని పేర్కొన్నారు. అనంతరం సర్వే అంశాలను వెల్లడించారు.

ముఖ్యాంశాలు: సర్వేలో మొత్తం 75 ప్రశ్నలు ఉంటాయి. ఇందులో 56 ప్రధానమైనవి. 19 అనుబంధ ప్రశ్నలు. రెండు పార్టులుగా విభజించి, 8 పేజీల్లో నమోదు చేస్తారు.

పార్టు -1 : పార్టు - 1 కుటుంబ యజమాని, సభ్యుల వ్యక్తిగత వివరాలు, విద్య, ఉపాధి, భూముల వివరాలు, రిజర్వేషన్ ప్రయోజనాలు, వలసల సమాచారం, రాజకీయ వివరాలు ఉంటాయి.

పార్టు- 2: కుటుంబ స్థాయికి సంబంధించిన మొత్తం 17 ప్రశ్నలు ఉంటాయి. వీటిలో 7 ప్రధాన ప్రశ్నలు, మిగతావి అనుబంధ ప్రశ్నలు.

భూముల వివరాలు : భూమి వివరాలు సేకరించే క్రమంలో ధరణిలో నమోదైన పట్టా నంబరు, భూముల రకాలు (మెట్ట, తరి, పడావు) వంటి వివరాలను ఇవ్వాలి. సాగు విస్తీర్ణం, నీటి వనరు, కౌలు భూమి వంటి సమాచారాన్ని అందజేయాలి.

రిజర్వేషన్ల సమాచారం: విద్య, ఉద్యోగ రిజర్వేషన్ల సదుపాయం పొందినా, ఐదేళ్లలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన పథకాలు ఉన్నా, వాటి వివరాలు నమోదు చేయాలి.

రాజకీయ సమాచారం: ప్రజాప్రతినిధులుగా పనిచేసిన వారి వివరాలు, పదవీ కాలం, నామినేటెడ్ వివరాల నమోదు.

వలసలు, ఉద్యోగం, ఉపాధి వివరాలు : ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలస వెళ్లిన కుటుంబ సభ్యుల వివరాలు, కారణాలు. ఉపాధి, వార్షిక ఆదాయం, వ్యాపారులైతే వార్షిక టర్నోవర్, సంప్రదాయ కులవృత్తుల వివరాలు నమోదు చేయాలి.

అపోహలు వద్దు : సర్వే సమయంలో ఫొటోలు, పత్రాలు తీసుకోరు. కుటుంబ యజమాని ఇచ్చిన సమాచారాన్ని గోప్యంగా ఉంచుతారు.

ఇతర ముఖ్య అంశాలు : దివ్యాంగుల వివరాలు, వైవాహిక స్థితి, దివ్యాంగుల వివరాలు, పశుసంపద, రేషన్ కార్డు నంబరు, తాగునీటి వనరు, విద్యుత్ సదుపాయం వంటి అంశాలను నమోదు చేస్తారు. ఈ సర్వే ద్వారా తెలంగాణ ప్రభుత్వం కుటుంబ స్థితిగతులపై సమగ్ర సమాచారాన్ని సేకరించి, భవిష్యత్ సంక్షేమ పథకాల రూపకల్పనలో ఉపయోపడే విధంగా ఉపయోగించుకుంటారు.

అవసరమైన సమాచారం: సర్వే సమయంలో ఆధార్ కార్డులు, భూమి వివరాలకు ధరణి పాస్ పుస్తకాలు, బ్యాంక్ ఖాతా దగ్గర ఉంచుకోవాలి. ఈ సర్వే చాలా కీలకం. ప్రతీ కుటుంబం అందుబాటులో ఉండి సంబంధిత సమాచారాన్ని ఇవ్వాలి. సర్వేకు వచ్చే వారికి సహకరించాలి.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సమగ్ర సర్వేకు సర్వం సిద్ధం

(5వ పేజీ తరువాయి)

సర్వే సమాచారంలో గోప్యత

జిల్లాలో సమగ్ర ఇంటింటి సర్వేలో 56 ప్రధాన అంశాలు 75 వరకు ప్రశ్నలను రూపొందించారు. తాజాగా ప్రశ్నల్లో కొన్ని మార్పులు చేశారు. పార్ట్ 1, పార్ట్ 2, కింద ఎనిమిది పేజీల్లో సమాచారం సేకరించినా వాటిని గోప్యంగానే ఉంచుతారు. ప్రభుత్వ పథకాలు, అర్హులైన వారికి అందించడానికి ప్రశ్నల రూపంలో సమాచారం రాబడుతున్నట్లు తెలుస్తోంది. కుటుంబం ఏ కులం, వృత్తి, మతాలు, విద్యార్హతలు, స్థిరాస్థులు, భూములు, రిజర్వేషన్ ప్రయోజనాలు, ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధి, ఇలా అనేక అంశాలు ఉన్నాయి. సర్వేను పది రోజుల వరకు పూర్తి చేసే దిశగా షెడ్యూల్ ఇచ్చారు. కానీ వివరాల సేకరణ తరువాత డేటా ఎంట్రీ వంటి అంశాలు పూర్తి నెలాఖరుకు పూర్తవుతుందని భావిస్తున్నారు.

తేలనున్న సామాజిక వర్గాల లెక్క

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో జిల్లాలోని సామాజిక వర్గాల లెక్క కూడా తేలనుంది తొలిసారిగా బీసీల లెక్క స్పష్టం కానుంది. గత ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 1.77లక్షల కుటుంబాలను సర్వే చేయగా అందులో ఎస్సీలు 1,13,870 మంది, ఎస్టీలు 26,346 మంది, బీసీలు 3,56,977 మంది, మైనార్టీలు 27,349 మంది, ఓసీలు 71,116 మంది ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం రాబోయే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్లకు సర్వే లెక్కలు దోహదపడనుండడంతో ప్రజల్లో ఆసక్తి నెలకొంది. కుటుంబ సర్వేలో అధికార కాంగ్రెస్ శ్రేణులు భాగస్వామ్యమయ్యే విధంగా ఆ పార్టీ పెద్దలు దృష్టి సారించారు.

పోకిరీలు వేధిస్తే సమాచారం ఇవ్వాలి

సిరిసిల్ల క్రైం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోకిరీలు వేధిస్తే షీటీంకు సాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు. సిరిసిల్ల పట్టణం పెద్ద బజారులోని హనుమాన్ ఆలయం వద్ద వచ్చిపోయే మహిళలను వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం ఉదయం షీ టీం సభ్యులు మఫ్టీలో నిఘా వేశారు. మహిళలను ఇబ్బదులకు గురి చేస్తున్న వ్యక్తిని పట్టుకొని కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా షీటీం అధికారులు మాట్లాడుతూ పెద్ద బజారులోని హనుమాన్ ఆలయం వద్ద వచ్చిపోయే మహిళలను వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి అతడి కుటుంబసభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. వేధింపులకు గురయ్యేవారు షీటీం నంబరు 87126 56425, డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించాలి

ఇల్లంతకుంట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్ర నిర్వాహకుడు అరికాంతపు అనీల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దివ్య, రమ్య, వేణు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఎల్లారెడ్డిపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని ఎల్లారెడ్డిపేట, నారాయణపూర్, బొప్పాపూర్, వెంకటాపూర్, రాగట్లపల్లి గ్రామాల్లోని రైతులను మంజూరైన రూ.48.50 లక్షల విలువైన చెక్కులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమపై దృష్టి సారించాలన్నారు. అన్నదాతల సంక్షేమానికి సహకారం సంఘం కృషి చేస్తోందన్నారు. దీర్ఘకాలిక రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతోందన్నారు. సెస్ డైరెక్టర్ కృష్ణహరి, డైరెక్టర్లు వెంకటనర్సింహారెడ్డి, ఎల్లయ్య, సంఘం కార్యదర్శి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి

వీర్నపల్లి, నవంబర్ 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ కార్మికుల మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేసి జీపి సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ మండల శాఖ అధ్యక్షులు న్యాత నర్సయ్య డిమాండ్ చేశారు. వీర్నపల్లి మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులందరూ పెండింగ్ సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నట్లు స్థానిక ఎంపీడీవో రఘురాంకు వినతి పత్రాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం జీపీ సిబ్బంది అందరిని పర్మినెంట్ చేయాలని కోరారు. కార్మికుల వేతనాల చెల్లింపుకు ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇందులో గ్రామపంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, తిరుపతి, నగేష్, రాజు, నర్సవ్వ, రాజవ్వ, నరేష్, వినయ్ పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేయాలి

సిరిసిల్ల రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతి చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు రాజభానుచంద్రప్రకాష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్ కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు జోగినపల్లి అనురాధ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు రాజభానుచంద్రప్రకాష్ మాట్లాడుతూ గతేడాది పదిలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో ప్రధానోపాధ్యాయులు కృషి చేశారన్నారు. అదే స్ఫూర్తితో ఈ విద్యా సంవత్సరం కూడా విద్యార్థులు ఉత్తీర్ణులు కావడానికి మరింత కృషి చేయాలన్నారు. రాష్ట్రంలోనే రాజన్న సిరిసిల్ల జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులతోపాటు ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో, డివిజన్ ఎడ్యుకేషన్ అధికార పోస్టులను సృష్టించి కల్పించాలని అన్నారు.

● జిల్లా గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా జోగినపల్లి అనురాధ, ప్రధాన కార్యదర్శిగా లకావత్ మోతీలాల్, కోశాధికారిగా మంద రాములు, రాష్ట్ర కౌన్సిలర్‌లుగా నాగుల భాగ్యరేఖ, దూస గోవర్ధన్‌ను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి వీఎం రఘునాథశర్మ ప్రకటించారు. ఎంఈవో దూస రఘుపతి, వీఎం శ్రీనివాస్, మద్దికుంట లక్ష్మణ్, రాజునాయక్, శ్రావణ్‌కుమార్, మురళీనాయక్, వినయ్‌కుమార్, లోకిని శారద, రేవతిదేవి, విద్యాసాగర్, అరాధన, శ్రీనివాస్, బాల ఎల్లయ్య, రాధాకిషన్‌రావు పాల్గొన్నారు.

విద్యార్థినులతో ప్రధానోపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

సిరిసిల్ల క్రైం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఓ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిని పోలీసులు అదుపులోకి తీసకొని విచారిస్తున్నట్లు సమాచారం.

ఎన్యూమరేటర్లకు శిక్షణ

తంగళ్లపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమగ్ర కుటుంబ సర్వే మండల ఎన్యూమరేటర్లకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జయంత్, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, మాస్టర్ ట్రైనర్లు సమగ్ర సర్వేలోని పలు అంశాలపై అవగాహన కల్పించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

రుద్రంగి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ధర్నా భూమయ్య, ననుగుల గోవర్ధన్ రెడ్డి, యెళ్ల దేవయ్య కుటుంబాలను బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ మాడిశెట్టి ఆనందం, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దయ్యాలకమలాకర్, బొడిగే అనిల్, గెంటె ప్రశాంత్, చెప్యాల గణేష్, మర్రిగడ్డ సతీష్, మర్రిపెల్లి విశాల్, గొళ్లెం నర్సింగ్, ఆకుల గంగారాం, కాదాసు లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

వేములవాడ రూరల్: మండలంలోని చెక్కపల్లిలో ఇటీవల మరణించిన ఎడపెల్లి లక్ష్మి కుటుంబాన్ని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. పిట్టల వెంకటేశం, గడ్డం హన్మాండ్లు, వెల్మ బాల్‌రెడ్డి, తిరుపతి, విష్ణు, మహేష్, భగవాన్ ఉన్నారు.